## క్లుప్తంగా

### లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సుగర్ పరీక్షలు



సుగర్ పరీక్షలు చేస్తున్న క్లబ్ సభ్యులు

సామర్లకోట: లయన్స్ క్లబ్ సామర్లకోట శాఖ ఆధ్వర్యంలో గురువారం సుగర్ పరీక్షలు నిర్వహించారు. ప్రజల్లో సుగర్ వ్యాధిపై అవగాహన కల్పించాలని లయన్స్ క్లబ్ నిర్ణయించింది. ఈ మేరకు సుగర్ వ్యాధి రావడానికి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించడానికి మున్సిపాలిటీ పరిధిలో ప్రతి వార్డులోను అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా చిన్న వీధిలో స్థానికులకు సుగర్ పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ కానుబోయిన విజయకృష్ణ, క్లబ్ కోశాధికారి బడుగు శ్రీకాంత్, క్లబ్ మాజీ అధ్యక్షుడు గుండు శంకరరావు, కర్రి ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ప్రధాన డ్రైన్‌లో పూడికతీత



ప్రధాన డ్రైన్‌లో పూడికతీతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

సామర్లకోట: సమస్యగా మారిన ప్రధాన డ్రైన్‌లోని పూడికతీత పనులను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప గురువారం పరిశీలించారు. స్థానిక బస్సు కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ప్రధాన డ్రైన్ వెంబడి అనేక బడ్డీలను ఏర్పాటు చేసి, వ్యాపారాలు చేసుకుంటున్నారు. పూడికతీతకు అవి అవరోధాలుగా మారుతున్నాయి. దీంతో ఆ బడ్డీలను తొలగించి పొక్లెయిన్ సహాయంతో పూడికతీత పనులు చేపట్టారు. ఈ పనులను ఎమ్మెల్యే పరిశీలించి, తొలగించిన పూడికలను వెనువెంటనే తరలించాలని కాంట్రాక్టర్లు సత్యానారాయణ, శెట్టిబత్తుల దుర్గారావుకు సూచించారు. చిరు వ్యాపారస్తులు డ్రైన్‌లో చెత్త వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బలుసు వాసు, వలూరి దొరబాబు, కర్రి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### తుపాను ప్రభావంతో కుండపోత



సామర్లకోట పోలీసు రింగ్ సెంటర్‌లో వర్షపు నీరు

సామర్లకోట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గురువారం కుంభవృష్టి కురిసింది. దాంతో పల్లపు ప్రాంతాల్లో రోడ్లు చెరువులను తలపించాయి. స్థానిక బస్సు కాంప్లెక్స్ రోడ్డు కంటే పల్లంగా ఉండటంతో, ముంపునీరు పోయే మార్గం లేకపోవడంతో కాంప్లెక్స్ అంతా చెరువుగా మారిపోయింది. దాంతో బస్సులు ఎక్కడానికి, దిగడానికి ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. స్టేషన్ సెంటర్, ప్రెసిడెంట్‌గారి వీధి, అయోధ్య రామపురం, రథం సెంటర్, సంపెంగ తోట, సాయి నగర్, ప్రసన్నాంజనేయనగర్, బ్రౌన్‌పేట, సీతారామ కాలనీలు చెరువులను తలపించాయి. ఆక్రమణల కారణంగా డ్రైన్లలో నీరు పోయే మార్గం లేకపోవడంతో రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయింది.

### విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సామర్లకోట: సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 11 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఏవీఎన్ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలన్నారు.

### కాంట్రాక్ట్ టీచరు పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

సామర్లకోట: పట్టణ పరిధిలో ప్రవాస కుటుంబాలకు చెందిన 21 మందికి విద్య బోధించడానికి టీచరు కావాలని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి-2 పి.పుల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పెదపుల్లి చెరువు వద్ద నివాసం ఉంటున్న ఎస్టీ కుటుంబాలకు చెందిన వారి పిల్లలు స్కూలుకు వెళ్లకుండా, బయట తిరుగుతున్నట్టు గుర్తించామన్నారు. వారికి సమగ్ర శిక్ష ద్వారా నాన్ రెసిడెన్షియల్ ప్రత్యేక శిక్షణా కేంద్రం ద్వారా శిక్షణ ఇస్తామన్నారు. ఇందుకు డిగ్రీతో పాటు, బీఈడీ చేసిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు చెప్పారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు శనివారంలోగా బయోడేటాతో పాటు, సర్టిఫికెట్ల కాపీలను మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందజేయవలసి ఉంటుందన్నారు. వలంటీరుగా ఎంపికైన టీచరుకు నెలకు రూ.10 వేల గౌరవ వేతనం ఇస్తారని చెప్పారు. ఫిబ్రవరి 25 వరకు విద్యా బోధన చేయవలసి ఉంటుందని తెలిపారు.

# గుండెకోత మిగిలె..

- కన్నీటిపాలైన కర్షకుడు
- రైతు పొట్ట కొట్టిన ఏలేరు వరద
- పరిహాసంగా మారిన ప్రభుత్వ పరిహారం



ఇసుక ర్యాంపు కాదు పంట పొలమే.. (పిఠాపురం మండలం రాపర్తి వద్ద పొలాల్లో మీటరు ఎత్తున వేసిన ఇసుక మేటలు)(ఫైల్)



పిఠాపురం మండలంలో పూర్తిగా మునిగిపోయిన వరి పంట

పిఠాపురం: ఏరువాక సాగి, దుక్కి దున్ని, దమ్ము చేసి, నారు తీసి, నాట్లు వేసి, ఉన్నదంతా పంటకు పెట్టుబడి పెట్టి, ఫలసాయం అందుతుందనే ఆశతో ఉన్న కర్షకుడికి వేదనే మిగిలింది. వేసిన పంట పోయింది మరోసారి పంట వేద్దాములే అనుకున్న అన్నదాతకు వరద మిగిల్చిన వేదన అంతా ఇంతా కాదు. అటు పంటపోగా, ఇటు మళ్లీ పంట వేసుకునే అవకాశం కూడా లేకుండా చేసింది ఏలేరు వరద.

పది రోజుల్లో పొట్ట దశకు వస్తుందని గంపెడాశతో ఉన్న రైతులకు అర్ధాంతరంగా వచ్చిన వరద రైతుల పొట్ట గొట్టింది. ఇటీవల ఏలేరు అదనపు జలాల విడుదలతో పిఠాపురం నియోజకవర్గంలో పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల రైతాంగం భవిష్యత్తు అంధకారంగా మారింది. పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి ప్రాంతాల్లో వరి, వాణిజ్య పంటలు నీటిలో పూర్తిగా మునిగిపోయి పనికి రాకుండా పోయాయి. వాటిలో ఏలేరు కాలువకు గండి పడిన ప్రాంతాల్లో బారీగా ఇసుక మట్టి వచ్చి చేరడంతో, వరి పొలాల్లో ఇసుక మేటలు వేశాయి.

**ఇసుక మేటలతో ఇరకాటం**

ప్రస్తుతం వరద తగ్గిన పంట పొలాల్లో ఇసుక మేటలు దర్శనమిస్తున్నాయి. పిఠాపురం మండలం రాపర్తి, రాయవరం, గొల్లప్రోలు మండలంలోని వివిధ గ్రామాల్లో పంట పొలాల్లో సుమారు 200 ఎకరాల్లో ఇసుక మేటలు వేయడంతో, రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ముఖ్యంగా ఏలేరు కాలువకు గండి పడిన పిఠాపురం మండలం రాపర్తి ఏరియాలో వరి పొలాల్లో సుమారు 2 అడుగుల మేర ఇసుక మేటలు వేసింది. దీంతో ఇసుక తొలగిస్తే మినహా తరువాత పంట వేసుకునే అవకాశం లేదని రైతులు వాపోతున్నారు.

**పరిహారానికి చెక్**

పంటలన్నీ నీట మునిగి, నాశనమై కళ్ల ముందు కనిపిస్తున్నా ప్రభుత్వం నిబంధనల పేరుతో.. ఇచ్చే కొద్దిపాటి నష్ట పరిహారాన్ని ఇవ్వకుండా ఆపేయడానికి ప్రయత్నిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

నాలుగు రోజులుగా పంట అంతా నీటిలో మునిపోయి, దుబ్బు కుళ్లిపోయి పనిచేయకుండా పోయినా, నష్ట పరిహారం ఎకరానికి రూ.10 వేలే అంటుంటే, అవి దేనికి సరిపోతాయంటూ రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇసుక మేట మూడు అంగుళాలు దాటి ఉంటేనే పరిహారం ఇస్తామంటూ అధికారులు చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. పంట పొలాల్లో టన్నుల కొద్దీ ఇసుక మేటలు కనిపిస్తుంటే, అధికారులు ఇంకా నిబంధనల సాకు చూపడం ఎంత వరకు సమంజసమని రైతులు గగ్గోలు పెడుతున్నారు. అయితే ప్రభుత్వ నిబంధనల మేరకే రైతులకు నష్ట పరిహారం విడుదలవుతుందని పిఠాపురం ఏడీఏ స్వాతి తెలిపారు.

**నియోజకవర్గంలో వ్యవసాయ గణాంకాలిలా..**

మొత్తం సాగుచేసిన వరి పంట 42 వేల ఎకరాలు
వరద నీటిలో ఉన్న వరి పంట సుమారు 36 వేల ఎకరాలు
పంట సాగుకు రైతులు పెట్టిన పెట్టుబడి ఎకరాకు రూ.25 వేలు

**పంటకు జరిగిన నష్టం**

| మండలం | విస్తీర్ణం (ఎకరాల్లో) | నష్టపోయిన రైతులు |
|---|---|---|
| గొల్లప్రోలు | 4,334 | 2,922 మంది |
| కొత్తపల్లి | 5,192 | 3,099 మంది |
| పిఠాపురం | 6,604 | 4,730 మంది |

**దెబ్బతిన్న ఇళ్లు**

| | |
|---|---|
| గొల్లప్రోలు మండలంలో | 2,071 |
| కొత్తపల్లి మండలంలో | 1,109 |
| పిఠాపురం మండలంలో | 1,490 |
| పిఠాపురం టౌన్‌లో | 58 |

### స్వచ్ఛ మున్సిపాలిటీలో భాగస్వాములు కండి

విద్యార్థులకు కమిషనర్ బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న కమిషనర్ శ్రీవిద్య

సామర్లకోట: ప్రతి ఒక్కరూ స్వచ్ఛ మున్సిపాలిటీ తయారు కావడంలో భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం మున్సిపాలిటీ పరిధిలోని హైస్కూల్ విద్యార్థులకు వ్యర్థ వస్తువులతో ఆట సామగ్రి తయారీ పోటీలు నిర్వహించారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో యార్లగడ్డ అక్కిరాజు, తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూళ్లు, బీబీఆర్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన పెరిగితే, తల్లిదండ్రులకు తెలియజేసే అవకాశం ఉంటుందన్నారు. ఇంటిలో చెత్తను కేవలం పారిశుధ్య వాహనానికి అందించేలా శ్రద్ధ చూపాలన్నారు. వ్యర్థ సామగ్రితో అందమైన, ఉపయోగకరమైన వస్తువులు తయారు చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎంలు తోటకూర సాయిరామకృష్ణ, యు.సత్యనారాయణ, టి.శ్యామ్‌సుందర్, కౌన్సిలర్ బలుసు వాసు, విద్యా కమిటీ చైర్మన్ అక్కిన చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

## భువనేశ్వరి పీఠంలో శరన్నవరాత్రులకు ఏర్పాట్లు

**28న రాట ముహూర్తానికి సన్నాహాలు**



పెద్దాపురంలోని భువనేశ్వరి అమ్మవారు

పెద్దాపురం: దేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక వర్జుల వారి వీధిలోని భువనేశ్వరి పీఠంలో ఏర్పాట్లు ముమ్మరం చేశారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లకు సన్నాహాలను పూర్తి చేశారు. ఈ సందర్భంగా గురువారం ఆయన ఇక్కడి విలేకర్లతో మాట్లాడుతూ, వచ్చే నెల మూడో తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాట ముహూర్తం చేయనున్నామన్నారు. ఉదయం 9.23కు వేముల సత్యసాయిప్రసాద్, అరుణ దంపతులు పాల్గొని రాట ముహూర్తం చేస్తారన్నారు. గత 25 ఏళ్లుగా భువనేశ్వరి పీఠంలో దేవి నవరాత్రులను నిర్వహిస్తున్నట్టు వివరించారు. నవ రాత్రుల్లో అమ్మవారికి ప్రతి రోజూ అభిషేక, సహస్ర నామ, కుంకుమ పూజలు, చండీ పారాయణం, హోమం నిర్వహిస్తారని తెలిపారు. ప్రత్యక్ష, పరోక్ష పద్ధతిలో అమ్మవారికి పూజలుంటాయని తెలిపారు. దేవి మాల ధరించే భక్తులు ముందుగా సంప్రదించాలని కోరారు.

## జిల్లా స్థాయి పోటీలకు జెడ్పీ విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీలు



800 మీటర్ల పరుగులో ప్రథమ స్థానం పొందిన సువర్ణలత

సామర్లకోట: జిల్లా స్థాయి పోటీలకు స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన 16 మంది విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం యు మీనామాధురి తెలిపారు. గురువారం పెద్దాపురం మహారాణి కళాశాల ఆవరణలో నిర్వహించిన నియోజకవర్గ పోటీల్లో పాఠశాలకు చెందిన అండర్-14, అండర్-17 విభాగాల్లో 16 మంది వివిధ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. 800 మీటర్ల పరుగులో ఎం సువర్ణలత నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టరు జి.శ్రీదేవి విద్యార్థులకు క్రీడల్లో మంచి శిక్షణ ఇవ్వడంతోనే 16 మంది జిల్లా స్థాయిలో ఎంపికయ్యారని చెప్పారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

## 30న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన



పెద్దాపురం ఆస్పత్రిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

పెద్దాపురం: సమాన పనికి.. సమాన వేతనం, మినిమమ్ టైం స్కేల్, పోస్టులను రెగ్యులర్ చేయాలన్న ప్రధాన డిమాండ్లతో ఈ నెల 30వ తేదీన కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ధర్నా చేపట్టనున్నట్లు సీఐటీయూ నాయకులు డి.క్రాంతికుమార్ తెలిపారు. గురువారం వివిధ ప్రభుత్వ కార్యాలయాల వద్ద చేపట్టే ధర్నాలను విజయవంతం చేయాలంటూ గురువారం ఉద్యోగులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు క్రాంతికుమార్, గడిగట్ల సత్తిబాబు మాట్లాడుతూ, ప్రభుత్వాలు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు అన్యాయం చేశాయన్నారు. గతంలో కార్మికులు చేసిన పోరాటల ఫలితం కొన్ని డిమాండ్లను సాధించుకున్నామన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని తలపెట్టిన ఈ ధర్నాలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం ప్రభుత్వాసుపత్రి, మున్సిపల్ కార్యాలయం, ఆర్డీఓ కార్యాలయం, ఐసీడీఎస్, ఉపాధి హామీ తదితర ప్రభుత్వ కార్యాలయాల వద్ద కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు వడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులు ఆరోగ్య సూత్రాలను పాటించాలి



సామూహిక సీమంతాలు చేస్తున్న కమిషనర్ తదితరులు

**మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య**

సామర్లకోట: బిడ్డ ఆరోగ్యం కోసం గర్భిణులు ఆరోగ్య సూత్రాలను కచ్చితంగా పాటించాలని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య అన్నారు. పోషకాహార మాసోత్సవాల సందర్భంగా గురువారం సాయంత్రం మెప్మా కార్యాలయంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. అలాగే గర్భిణులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అమలు చేస్తున్న పోషకాహార పథకాలపై గర్భిణులు అవగాహన పెంచుకోవాలన్నారు. మూడో మాసం నుంచి ప్రతి నెలా ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకుని, డాక్టర్ల సూచనలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులు, సీఆర్పీలు తయారుచేసిన పౌష్టికాహారాన్ని రుచి చూశారు. వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి మెప్మా సిటీ మిషన్ మేనేజర్ సుజాత అధ్యక్షత వహించారు. మెప్మా జిల్లా ప్రత్యేకాధికారి జ్యోతి, సీఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ స్థలంలో ఆక్రమణ తొలగింపు

**స్థల వివాదంపై భక్తుల ఆందోళన**



ఆక్రమణ స్థలం వద్ద ఆందోళన చేస్తున్న భక్తులు

కొత్తపల్లి: మండలంలోని నాగులాపల్లిలో ఆక్రమణకు గురైన కనకదుర్గమ్మ ఆలయ స్థలాన్ని ఎట్టకేలకు పంచాయతీ అధికారులు గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. స్థానికంగా ఉన్న ఓ మహిళ ఆ స్థలంలో నిర్మించిన ప్రహరీ గోడను తొలగించారు. భక్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగులాపల్లి గొల్లపేటలో సుమారు 30 ఏళ్ల క్రితం కనకదుర్గమ్మ ఆలయాన్ని నిర్మించారు. ఆ ఆలయం పూర్తిగా శిథిలం కావడంతో, పునర్నిర్మాణం కోసం ఇటీవల ఆలయ కమిటీ సభ్యులు దానిని తొలగించారు. దీంతో పక్కనున్న ఓ మహిళ ఆలయ స్థలం తమదే అని ప్రహరీ నిర్మించారు. దీంతో భక్తులు ఆలయ స్థలం ఆక్రమణకు గురైందని జిల్లా, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పంచాయతీ సిబ్బంది గురువారం రాత్రి అక్రమంగా నిర్మించిన ప్రహరీని తొలగించారు. పంచాయతీ పేరుతో హెచ్చరిక బోర్డును ఏర్పాటుచేశారు. ఆ మహిళ ఆ బోర్డును తొలగించడంతో, భక్తులు ఆందోళన నిర్వహించారు. ఈ నేపథ్యంలో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న కొత్తపల్లి ఎస్సై వెంకటేష్ పంఘటన స్థలానికి చేరుకుని, సమస్యను శాంతియుతంగా పరిష్కరించారు.

## వాకతిప్పలో ఘనంగా పసర పండగ



వాకతిప్పలో నిర్వహిస్తున్న పసర పండగ

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్పలో ఉన్న శెట్టిబలిజపేటలో గురువారం సాయంత్రం ఘనంగా పసర పండగ నిర్వహించారు. పూర్వ కాలం నుంచి పెద్దాపురం మరిడమ్మ ఈ పేటలో రావిచెట్టు దగ్గర కొలువై ఉంటుందని, పొలాలు పచ్చదనంతో ఉన్నప్పుడు గురువారం అమ్మవారికి ధూప దీప నైవేద్యాలతో ఈ పండగ నిర్వహించడం ఆచారంగా వస్తోందని గ్రామ పెద్దలు వివరించారు. గ్రామంలో పిల్లలు, పెద్దలు, వివిధ వర్గాల వారు సుఖశాంతులు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లేందుకు ఈ పండగ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

## సినీ థియేటర్‌ను తనిఖీ చేసిన తహసీల్దార్



సామర్లకోటలోని సినీ థియేటర్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ తదితరులు

సామర్లకోట: దేవర సినిమా విడుదల సందర్భంగా థియేటర్ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి సూచించారు. ఈ సినిమాను ప్రదర్శించే అనుశ్రీ థియేటర్‌ను గురువారం సాయంత్రం తహసీల్దార్ తన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన రేట్ల ప్రకారమే టిక్కెట్లు విక్రయించాలన్నారు. అధిక రేట్లకు విక్రయిస్తే చర్యలు ఉంటాయన్నారు. థియేటర్ సామర్థ్యం మేరకే టిక్కెట్లు విక్రయించాలని ఆదేశించారు. థియేటర్ వద్ద వీఆర్వోలు, పోలీసు సిబ్బంది ఉంటారని స్పష్టం చేశారు. పోలీసులు కూడా థియేటర్‌పై నిఘా ఉంచాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ వై శ్రీనివాసు, వీఆర్వోలు, థియేటర్ నిర్వాహకులు ఉన్నారు.

## తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు



పథకాన్ని పరిశీలిస్తున్న డీఈఈ శ్రీనివాసరావు

కొత్తపల్లి: కాకినాడ డివిజన్ పరిధిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ డి.శ్రీనివాసరావు అన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఆయన మండలంలోని వాకతిప్ప శివారులో ఉన్న నాగులాపల్లి ఏరియా రక్షిత తాగునీటి ప్రాజెక్టును గురువారం సందర్శించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలించారు. ఫిల్టర్ బెడ్లు, మోటార్ల పనితీరు, తాగునీటి సరఫరా విధానాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాగునీటి సరఫరా విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్రామాల్లో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులను పంచాయతీ సిబ్బందితో సకాలంలో శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని, పైపులైన్ల మరమ్మతులు ఎప్పటికప్పుడు పూర్తి చేసేలా శ్రద్ధ చూపాలన్నారు. కాంట్రాక్టర్లు అందుబాటులో ఉంటూ అధికారులకు సహకరించాలన్నారు. ఆయన వెంట జేఈలు జి.రమణ, సంధ్య ఉన్నారు.

### 30న కౌన్సిల్ సాధారణ సమావేశం

సామర్లకోట: ప్రతి నెలా జరిగే మున్సిపల్ పాలక మండలి సమావేశం ఈ నెల 30న ఉదయం 11 గంటలకు జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షత వహిస్తారని చెప్పారు. పట్టణంలో అభివృద్ధి పనులకు సంబంధించి 12 అంశాలతో అజెండాను రూపొందించినట్టు తెలిపారు. దీనిపై చర్చించేందుకు సభ్యులందరూ హాజరు కావాలన్నారు. ఆయా శాఖలకు చెందిన అధికారులు సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

### నాణ్యమైన ఆహారం అందజేయాలి


రైల్వే స్టేషన్ మేనేజర్ రమేష్



ఆహార పదార్థాలను తయారు చేసే హోటల్‌ను తనిఖీ చేస్తున్న స్టేషన్ మేనేజర్ రమేష్ తదితరులు

సామర్లకోట: రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను అందజేయాలని రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం రమేష్ అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం ప్లాట్‌ఫాంపై తినుబండరాలను తయారు చేసే హోటల్, స్టాళ్లను తనిఖీ చేశారు. రైల్వే అధికారులు నిర్ణయించిన రేట్లకే వస్తువులను విక్రయించాలన్నారు. ప్రతి స్టాల్‌లోను వస్తువుల విక్రయాలకు సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. నిల్వ పదార్థాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌తో పాటు, పరిసరాలను స్వచ్ఛంగా ఉండేలా అందరూ కృషి చేయాలన్నారు. ఆయన వెంట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ శ్రీనివాసు తదితరులు ఉన్నారు.

### సినిమాలు



| | |
|---|---|
| **పెద్దాపురం** | |
| లలితా స్క్రీన్-1 | దేవర |
| లలితా స్క్రీన్-2: | సత్యం సుందరం |
| వీరభద్ర | దేవర |
| శోభా | భలే ఉన్నాడే |
| **సామర్లకోట** | |
| అనుశ్రీ స్క్రీన్-1 | దేవర |
| అనుశ్రీ స్క్రీన్-2 | దేవర |
| విఘ్నేశ్వర | మత్తు వదలరా 2 |
| **పిఠాపురం** | |
| అన్నపూర్ణ | మత్తు వదలరా 2 |
| పూర్ణ | టూ షోస్ చెక్ లేట్ |
| పూర్ణ 2 | దేవర |
| శ్రీసత్య | దేవర |
| శ్రీవెంకటేశ్వర | దేవర |
| **ఉప్పాడ** | |
| శ్రీనివాస | మత్తు వదలరా 2 |